క్లుప్తంగా

విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లు ఇవ్వాలి



జగ్గంపేటలో నిరసన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

జగ్గంపేట: విద్యార్థులకు ఉచిత బస్ పాసులు మంజూరు చేయాలని కోరుతూ జగ్గంపేటలో శుక్రవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని హైస్కూల్, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, యూనివర్సిటీల్లో చదువుతున్న విద్యార్థులు బస్ పాసులు కోసం అధిక మొత్తంలో చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరంతా పేద విద్యార్థులు కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీరికి ఉచిత బస్ పాసులు ఇవ్వాలని కోరారు. ఫిట్‌నెస్ లేని ఆర్టీసీ బస్‌లను తిప్పుతున్నారని, కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా కొత్త బస్‌లు తీసుకురాలేదని విమర్శించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు సాయి, నారాయణ, గంగాధర్, స్వామి, అభిషేక్, తేజ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలక్షేత్రంలో ప్రత్యేక పూజలు



రాచపల్లి అరుణాచల క్షేత్రంలో భవానీ మండలి దీక్షను స్వీకరించిన భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం భవాని భక్తులు మాలధారణ స్వీకరించారు. భవానీ భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అభిషేకాలు నిర్వహించారు. భవానీ దీక్ష చేపట్టిన భక్తులతో ఆలయ ప్రాగాణంలో కళకళలాడింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

గిరిజనుల కల సాకారం

శంఖవరం: గిరిజనుల కల సాకారమైందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని పెదమల్లాపురంలో కత్తిపూడి –వేళంగి ఏపీఎస్ ఆర్టీసీ నూతన బస్సు సర్వీసును ఆమె జెండా ఊపి ప్రారంభించారు. శంఖవరం నుంచి వేళంగి వరకూ ఆర్టీసీ బస్సులో కూటమి నేతలతో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశాబ్దాలుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక గిరిజనులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి బస్సు సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జిల్లా రీజనల్ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు, తుని డిపో మేనేజర్ జీవీవీ రమణ, కూటమి నాయకులు పర్వత సురేష్, బచ్చల గంగ, కీర్తి సుభాష్, బద్ది రామారావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ధర్మవరంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు శుక్రవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన కడారి నూకరాజు కుమారుడు వీరబాబు అనారోగ్యంతో కాకినాడ మెడికోవర్ ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. కాగా వీరబాబును మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోలా తాతబాబు, ముచ్చర్ల దాసు, బాబులు, జువ్వల దొరబాబు, ముచ్చర్ల రాజు, బావిశెట్టి రాఘవ, కడారి వీరన్న, కడారి తాసు, చల్లాది రమణ, కడారి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

కోటనందూరు:

తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ–1	89856 02864
ఎంఈఓ–2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613
ఎస్సై	94409 00773
వెలుగు ఏపీఎం,	80088 04895
ఉపాధిహామీ ఏపీఓ,	70939 98217

కూలేందుకు సిద్ధంగా..

- శిథిలావస్థలో మండల పరిషత్ కార్యాలయ భవనం
- శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్న వైనం
- ఉద్యోగులు, సిబ్బందికి తప్పని తిప్పలు



శిథిలావస్థకు చేరిన తొండంగి మండల పరిషత్ కార్యాలయ భవనం

తొండంగి: దీర్ఘకాలం క్రితం నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పూర్తిగా శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. చినుకుపడితే చాలు భవనంలోని అన్ని కార్యాలయాల్లోకి వర్షంనీరు చేరి చిత్తడిగా మారుతోంది. శిథిలమైన భవనంలో విధులు నిర్వహించేందుకు ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారు. నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకుంటే భవనం కూలిపోయే ప్రమాదం ఉందని ఉద్యోగులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

40 ఏళ్ల క్రితం నిర్మాణం

సుమారు 40 ఏళ్ల క్రితం మండలంలోని తొండంగి ఊర చెరువులో కొంత భూమిని కేటాయించి విశాలమైన ప్రాంగణంతో మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. దీనిలో మండల పరిషత్ సమావేశపు హాలు, ఎంపీపీ గది, ఎంపీడీవో కార్యాలయం, రికార్డు రూము, మండల పరిషత్ సూపరింటిండెంట్, కంప్యూటర్ సిబ్బందికి మరో గది, వ్యవసాయ శాఖ, ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ విభాగం కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. ఫిల్లర్స్ లేకుండా గోడల ఆధారంగా భవనం నిర్మించారు. చెరువు నేల కావడంతో పునాది కుంగిపోయి గోడలు బీటలు వారాయి. ఈ నేపథ్యంలో పలు మార్లు మరమ్మతులు చేపట్టారు. ఫిల్లర్లు, భీమ్‌లు లేని కారణంగా మళ్లీ యథావిధిగా గోడలు బీటలు వారి శ్లాబ్ పెచ్చులూడుతోంది.



శిథిలభవనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

శిథిల భవనంలోనే.

వ్యవసాయ, ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ శాఖల ఉద్యోగులు, సిబ్బంది శిథిల భవనంలోనే బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే రికార్డులు తడిసిపోవడం, కంప్యూటర్లు మరమ్మతులకు గురవ్వడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్ సమావేశపు హాలులో కూడా ఇదే పరిస్థితి ఉండటంతో సర్వసభ్య సమావేశాలు, అధికారిక సమీక్షలకు ప్రజాప్రతినిధులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకుని ఏళ్లు గడుస్తున్నా... ప్రభుత్వాలు మారుతున్నా నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోలేదు.

మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోనే స్త్రీశక్తి భవనంలో అధికారిక సమీక్షలు, సమావేశాలు తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. ఐకేపీ సిబ్బంది సమావేశాలు, మండల పరిషత్ సమావేశాలు ఒకేసారి నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో వివిధశాఖల రికార్డులకు ప్రమాదం పొంచి ఉంది. కంప్యూటర్లు, రికార్డులను భద్రపరిచేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల పరిషత్ కార్యాలయంతో పాటు ఇతర కార్యాలయాలను ప్రత్యామ్నాయంగా మరో భవనంలోకి మార్చాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

మండల పరిషత్ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఈ భవనాన్ని పరిశీలించి, నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు నివేదించాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన మార్గదర్శకాలు, ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– సాయినవీన్,
ఇన్‌చార్జి ఎంపీడీవో, తొండంగి





బీటలు వారి కూలేందుకు సిద్ధంగా ఉన్న మండల పరిషత్ కార్యాలయం గోడలు. పెచ్చులూడిన శ్లాబ్ (అంతర చిత్రం)

బొత్సను కలిసిన గిరిబాబు



విజయవాడలో బొత్స సత్యనారాయణను కలిసిన గిరిబాబు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శుక్రవారం కలిశారు. విజయవాడలో బొత్సను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో పరిస్థితులను వివరించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకోవలసిన చర్యలపై గిరిబాబుకు బొత్స పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బూత్ కమిటీలు, గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల కమిటీలను త్వరితగతిన పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని బొత్స సూచించినట్లు తెలిపారు.

15న ఉచిత కంటి వైద్య శిబిరం

తుని: స్థానిక కొత్తపేట పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో ఈ నెల 15న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన అకీర కంటి ఆసుపత్రి వైద్యులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ రోగులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. తుని పట్టణ, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం



గోకవరంలో మీడియాతో మాట్లాడుతున్న తోట నరసింహం

గోకవరం: బాలికను అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం డిమాండ్ చేశారు. గోకవరంలో టీడీపీ నేత బంధువు, మరో యువకుడు అత్యాచారానికి పాల్పడిన బాలిక కుటుంబ సభ్యులను శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. కోరుకొండ సీఐ సత్యకిషోర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఘటనకు పాల్పడిన దోషులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇద్దరు కామాంధులు మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డారని, ఈ క్రమంలో బాలికను చిత్ర హింసలకు గురి చేశారన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా దోషులు దర్జాగా తిరుగుతున్నారన్నారు. రాష్ట్రంలో ఇటువంటి ఘటనలు జరుగుతున్నా పోలీసుల చర్యలు శూన్యమన్నారు. పోలీసులకు పేకాట, గుండాటలపై ఉన్న శ్రద్ధ మహిళలు, బాలికల రక్షణపై లేదని విమర్శించారు. నిందితులపై ఫిర్యాదు చేసి నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకూ దోషులను అరెస్టు చేయలేదన్నారు. పోలీసులకు ప్రభుత్వం నుంచి రాజకీయ ఒత్తిడి ఉన్నట్టుగా కనిపిస్తోందన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. బాధితురాలి తల్లి మాట్లాడుతూ తన కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడిన వారిని ఉరితీయాలని డిమాండ్ చేసింది. అనంతరం బాధిత కుటుంబానికి పార్టీ తరఫున బియ్యం, నగదు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తోట శ్రీరాంజీ, ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుల్లా ఏడుకొండలు, కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడు సుజాత, ఎస్సీ సెల్ కార్యదర్శి తోలేటి రాంప్రసాద్, జిల్లా కార్యదర్శి మడికి మైనరబాబు, క్రిస్టియన్ మైనారిటీ కార్యదర్శి అంబటి అబ్రహం, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బూలా అబ్బులు, నాయకులు కర్రి సూరారెడ్డి, సమ్మెటి మోహన్, బిజ్జి రాజు, కూరాకుల సుమంగళి, క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాన్ వెస్లీ, వుయ్యూరి నాని తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ముద్రగడ పరామర్శ



ధర్మవరంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శుక్రవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన కడారి వీరబాబు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనను గిరిబాబు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బచ్చు రాంబాబు భార్య కాలుకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం గిరిబాబు వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో అవసరం మేరకు యూరియా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి నాని, జువ్వల బాబులు, బొల్లు చిట్టీబాబు, మచ్చకర్ల దాసు, రాపా గుర్రాజు, సానా తాతీలు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపాటు



తోట నరసింహం

గోకవరం: సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్ తోట నరసింహం విమర్శించారు. గోకవరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అటు చలనచిత్ర రంగంలోనూ, ఇటు రాజకీయాల్లో విఫలమయ్యారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన పవన్ కల్యాణ్ హరిహర వీరమల్లు సినిమా మాదిరిగా కూటమి ప్రభుత్వ పాలన ఉందంటూ విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ సమయంలోనే ప్రజా వ్యతిరేకతను కూడగట్టుకుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో ప్రజలు స్వచ్ఛందంగా ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రభుత్వ వ్యతిరేకతకు అద్దం పడుతోందన్నారు. ఎన్నికల సమయంలో సుమారు 140కు పైగా హామీలు ఇచ్చిన కూటమి నాయకులు, వాటిని గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. ఆడ బిడ్డ నిధి తదితర పథకాల ప్రస్తావన లేకుండా సూపర్ సిక్స్ అమలు చేశామనడం సరికాదన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ హేయమైన చర్య

వైఎస్సార్ సీపీ పాలనలో వైద్య కళాశాలలను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తే, ప్రస్తుతం వాటిని ప్రైవేటీకరణ చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేయడం హేయమైన చర్య అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని వైద్య కళాశాలల ప్రైవేటీకరణను కచ్చితంగా నిలుపుదల చేస్తామన్నారు. మహిళా రైతులు సైతం యూరియా కోసం సొసైటీలు వద్ద కొట్టుకోవడం రాష్ట్రంలోని పరిస్థితులను అద్దం పడుతున్నాయన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న సమయంలో కూటమి నేతలు సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తోట శ్రీరాంజీ, ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, నాయకులు సమ్మెట మోహన్, కర్రి సూరారెడ్డి, తోలేటి రాంప్రసాద్, మడికి మైనర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం



ఏలేశ్వరంలో హెచ్‌ఎం లక్ష్మీతులసిని సన్మానిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

ఏలేశ్వరం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను పట్టణంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.లక్ష్మీతులసి, ఏలేరు ప్రాజెక్టు ఏరియా ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు కొవ్వాడ వీర్రాజు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందారు. కాగా అవార్డు గ్రహీతలను అలమండ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల్లో శాలువా, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ అలమండ దుర్గావెంకటప్రసాద్ మాట్లాడుతూ ఏలేశ్వరం పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ అవార్డులు పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తూమురొతు గురయ్య, వుడతల రమణారావు, ఉపాధ్యాయులు బాలరాజు, చిన్నిబాబు, శ్రీరామ్, లోవప్రసాద్, సూరన్నదొర, గంగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ వెంకటనారాయణ

కోటనందూరు: మండలంలోని కేఈ చిన్నయ్యపాలెం, కోటనందూరు–1, 2 గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ పుప్పాల వెంకటనారాయణ శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. సర్వేలపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ సక్రమంగా అందించే బాధ్యత సచివాలయ ఉద్యోగులదే అన్నారు. నిర్ణీత సమయంలో విధులకు హాజరు కావాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండాలని, సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని ఆదేశించారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి



రౌతులపూడిలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న సీతారామశర్మ

రౌతులపూడి: రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్ర సమన్వయకర్త ఎ.సీతారామశర్మ సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిరుధాన్యాల సాగుపై వ్యవసాయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీతారామశర్మ మాట్లాడుతూ రాగులు, జొన్నలు,సజ్జలు, అరికలు, సామలు వంటి ఆరోగ్యకరమైన చిరుధాన్యాలను పండించడం ద్వారా ప్రజలకు ఆరోగ్యవంతమైన ఆహార దినుసులు అందించవచ్చన్నారు. చిరుధాన్యాల సాగులో తీసుకోవాల్సిన మెళకువలు, సస్యరక్షణ చర్యలు, నానో యూరియా, డీఏపీ వినియోగం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు, వెలుగు ఏపీఓ త్రినాథమ్మ, సీసీ నాగమణి, మండల వ్యవసాయశాఖ విస్తరణాధికారి(ఏఈఓ) మౌళి, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి వరలక్ష్మి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దక్కన్ కెమికల్స్ ఉద్యోగులు

తుని: స్థానిక దక్కన్ ఫైన్ కెమికల్స్‌లో టెక్నికల్ డైరెక్టర్ కేవీఎల్‌పీ రాజు, వైస్ ప్రెసిడెంట్, హెచ్‌ఆర్ పీవీఎస్‌ఎస్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మదర్, వైఎస్సార్ బ్లడ్ బ్యాంకుల సహకారంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది కంపెనీ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్ రాజు మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల సహాయార్థం గత మూడు సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓగా సత్యారెడ్డి బాధ్యతల స్వీకరణ



నూతన ఎంపీడీఓకు స్వాగతం పలుకుతున్న అధికారులు, సిబ్బంది

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా కర్రి హరికృష్ణ సత్యారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. యు.కొత్తపల్లి డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. మండల ఏఓ కె. చంద్రరావు, డిప్యూటీ ఎంపీడీఓ ఐఎన్ శ్రీనివాస్, ఎంఈఓలు కేహెచ్ నాయక్, వెంకటరెడ్డి, ఏపీఓ ఎం.కృష్ణరాజు, కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం నూతన ఎంపీడీఓ సత్యారెడ్డి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



ఏలేరు ప్రాజెక్టులో చేపపిల్లలు వదులుతున్న జిల్లా కలెక్టర్, షణ్మోహన్, ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం: మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. స్థానిక ఏలేరు ప్రాజెక్టులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో కలిసి 10 లక్షల చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏలేరు ప్రాజెక్టులో చేపల పెంపకం ద్వారా మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు వేదుల సూర్యనారాయణ, ఉపాధ్యాయుల రమేష్, ప్రయాగ రాంబాబు, చిట్టెం వాసు, వేణు, చెల్లాపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. హోమంలో దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులతో పాటు 25 మంది భక్తులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి పరిచారకుడు నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ పండితులు కుంకుమపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

బాలల పరిరక్షణపై అవగాహన



బాల్య వివాహాల నివారణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

గండేపల్లి: పిల్లలను దత్తత తీసుకునేవారు స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహాలను సంప్రదించాలని ఎంపీడీఓ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, బాలల పరిరక్షణ జిల్లా అధికారి సీహెచ్ వెంకట్రావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ అధ్యక్షతన శుక్రవారం బాలల పరిరక్షణ, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల దత్తత, పోస్టర్ కేర్, బాలల రక్షణ, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం బాల్య వివాహాల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు నాగపార్వతి, సునీత, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

శంఖవరం: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీఓ బాలమణి సూచించారు. మండలంలోని గౌరంపేటలో తడి, పొడి చెత్త సేకరణను శుక్రవారం ఆమె పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి, పొడి చెత్త సేకరించే పారిశుద్ధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలు తమ ఇళ్లలో వ్యర్థాలను రోడ్లు, డ్రైన్లలో వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మణి పాల్గొన్నారు.

తీరంలో అలజడి



పెరుమాళ్లపురం ఎగసిపడుతున్న సముద్ర అలలు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శుక్రవారం సముద్రతీరం అల్లకల్లోలంగా మారింది. మండలంలోని అద్దరిపేట, దానవాయిపేట, కొత్తపేట, యర్రయ్యపేట, వాడముసలయ్యపేట, వాకదారిపేట, తాటియాకులపాలెం, పెరుమాళ్లపురం, కొత్తచోడిపల్లిపేట, వేమవరం, పంపాదిపేట తదితర సముద్రతీరాల్లో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. సముద్రంలో ప్రతికూల వాతావరణం కారణంగా మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ఎఫ్‌డీవో సీహెచ్.ఉమామహేశ్వరరావు సూచించారు.